


టన్ను చీనీ రూ.24,300

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,300, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 80 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు ఉషశ్రీచరణ్ శుభాకాంక్షలు



పెనుకొండ రూరల్: జిల్లా ప్రజలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది అందరి జీవితాల్లో ఉషస్సులు నింపాలని ఆకాంక్షించారు. భగవంతుడు అందరికీ ఆయురారోగ్యాలు, అష్ట ఐశ్వర్యాలు ప్రసాదించాలని కోరారు. అలాగే నెలరోజులపాటు రోజా ఆచరించిన ముస్లింలు రంజాన్ పండుగను ఆనందోత్సహాల మధ్య జరుపుకోవాలన్నారు. అలాహ్ కరుణ అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు.

ప్రజలకు ఎస్పీ పండుగ శుభాకాంక్షలు

పుట్టపర్తి టౌన్: జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి ఎస్పీ రత్న ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు సంవత్సరాది ఉగాది..అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఉగాది వేడుకలను కుటుంబసభ్యులతో అందరూ సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. అలాగే రంజాన్‌ను ముస్లింలంతా ఆనందంగా జరుపుకోవాలన్నారు. అల్లాహ్ దీవెనలతో జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి సకల శుభాలు కలగాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు..

రంజాన్ పండుగను నేపథ్యంలో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించాల్సిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ రత్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా 31వ తేదీ సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఈద్గా మైదానం వద్ద ఏర్పాట్ల పరిశీలన



ఈద్గామైదానం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ వి.రత్న, మతపెద్దలు


హిందూపురం: పండుగలను శాంతియుతంగా, సోదరభావంతో సంతోషంగా జరుపుకుందామని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం ఆమె హిందూపురం ఆర్‌పీజీటీ వద్ద ఉన్న ఈద్గాను సందర్శించారు. ఈద్గా వద్ద రంజాన్ ప్రార్థనల కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ఆమె కొట్నూరులో జరిగిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ మహేష్, సీఐ జనార్దన్, ఈద్గా ముతవల్లి నూరుల్లా, ఖలీల్ తదితరులు ఉన్నారు.

ఆ రైళ్లు మరో నెల 'అనంత' నుంచే రాకపోకలు



అనంతపురం సిటీ: ధర్మవరం–మచిలీపట్నం మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లు (నంబర్: 17215/17216) మరో నెల రోజుల పాటు (మే1 వరకూ) అనంతపురం రైల్వే స్టేషన్ నుంచే రాకపోకలు సాగిస్తాయని స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ తెలిపారు. ధర్మవరం వద్ద రైల్వే పనులు జరుగుతున్న దృష్ట్యా అనంతపురం వరకే పరిమితం చేశారని వివరించారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.

వనరులున్నా.. చొరవ సున్నా!



- మడకశిరలో పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపని పాలకులు
- పారిశ్రామిక వాడలో నిరుపయోగంగా 1,600 ఎకరాల భూమి
- 9 నెలలు గడిచినా మాటలకే పరిమితమైన కూటమి ప్రభుత్వం
- తప్పనిసరి పరిస్థితుల్లో వలసబాట పడుతున్న నిరుద్యోగులు

ఇది మడకశిర మండలం ఆర్.అనంతపురం వద్ద పారిశ్రామికవాడ ఏర్పాటుకు సేకరించిన భూమి. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటూ రైతుల నుంచి ఏపీఐఐసీ 1,600 ఎకరాలను సేకరించింది. అలాగే మరికొన్ని వందల ఎకరాల సేకరణకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. అయితే ఇంత వరకూ ఈ పారిశ్రామిక వాడలో ఏ ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదు. కూటమి నాయకుల హడావుడి తప్ప పరిశ్రమలు రాకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు.



ఇది మడకశిర మీదుగా ఏర్పాటు చేసిన 544–ఈ జాతీయ రహదారి. ఆంధ్ర – కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేస్తోంది. ఈ జాతీయ రహదారి రెండు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచింది. మడకశిరలో పరిశ్రమలను ఏర్పాటు చేస్తే ఈ రహదారి ఎంతగానో దోహదం చేస్తుంది. అయినా కూడా కూటమి ప్రభుత్వం పారిశ్రామికవాడలో పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపడం లేదు.

మడకశిర: జిల్లా సరిహద్దులో ఉన్న మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వనరులు ఉన్నాయి. 1,600 ఎకరాల భూమి సిద్ధంగా ఉంది. రవాణాకూ ఇబ్బంది లేదు. అయినా కూడా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. పరిశ్రమలు వచ్చేస్తున్నాయి అంటూ హడావుడి తప్ప ఏమీ చేయకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సమృద్ధిగా వనరులు..

నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు వనరులు సమృద్ధిగా ఉన్నాయి. వక్క, చింతపండు, చింతవిత్తనాల ఉత్పత్తి ఇక్కడ అధికంగా ఉంది. దీంతో వీటికి సంబంధించిన ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. అలాగే జిల్లాలో ఎక్కడా లేని విధంగా 22 గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. గ్రానైట్ పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి అవసరమైన ముడి సరుకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంది. గ్రానైట్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే నిరుద్యోగులకు కొంత వరకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

నిరుద్యోగుల వలస బాట..

మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలు ఏర్పాటుకాకపోవడంతో నిరుద్యోగులు వలస బాట పట్టారు. కూటమి ప్రభుత్వం వస్తే పరిశ్రమలు వస్తాయని వారు ఆశించారు. అయితే వారి ఆశలు అడియాసలయ్యాయి. దీంతో చాలా మంది బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లారు.

హడావుడి తోనే సరి..

తాజాగా స్థానిక ఎమ్మెల్యే, కూటమి నాయకులు పరిశ్రమల ఏర్పాటుకు కనీస చర్యలు తీసుకోకపోగా...హడావుడి మాత్రం చేస్తున్నారు. పత్రికల్లో మడకశిరకు భారీ పరిశ్రమలు అంటూ ప్రచారం హోరెత్తిస్తున్నారు. మడకశిర, గుడిబండ మండలాల్లో సోలార్ పార్కులంటూ ప్రచారమే తప్ప ఏర్పాటుకు అడుగులు పడలేదు.

రవాణాకు అనుకూలం..

మడకశిర పారిశ్రామికవాడలో పరిశ్రమలను ఏర్పాటు చేస్తే రవాణా సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో ఉంది. ప్రధానంగా మడకశిర మీదుగా కర్ణాటక-ఆంధ్ర రాష్ట్రాల మధ్య హైవేల అనుసంధానం కూడా జరిగింది.దీంతో పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకును తీసుకుని రావడానికి, ఉత్పత్తి చేసిన సరుకులను తరలించడానికి సులభంగా ఉంటుంది. ప్రధానంగా మడకశిర మీదుగా 544–ఈ జాతీయ రహదారిని ఏర్పాటు చేశారు. కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి కర్ణాటకలోని శిర జాతీయ రహదారికి అనుసంధానం చేశారు. దీంతో మంగళూరు, కృష్ణపట్నం పోర్టులకు కూడా కనెక్టివిటీ ఏర్పడింది. మడకశిర పారిశ్రామికవాడకు బెంగళూరులోని దేవనహళ్లి కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం కూడా కేవలం 100 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. పారిశ్రామికవేత్తలు వచ్చి వెళ్లేందుకు సులభంగా ఉంటుంది. పరిశ్రమల ఏర్పాటుకు పలువురు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నా.. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం లేకపోవడంతో పరిశ్రమల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

వైఎస్సార్ హయాంలోనే భూ సేకరణ..

2004లో అప్పటి సీఎం వైఎస్సార్ మడకశిరలో పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, ఛత్రం గ్రామాల పరిధిలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు 1,600 ఎకరాలు సేకరించారు. ఆయన అకాల మరణం తర్వాత వచ్చిన పాలకులు పారిశ్రామికవాడ అభివృద్ధి గురించి పట్టించుకోలేదు.

జగన్ హయాంలో మంచిరోజులు..

వైఎస్ జగన్ 2019లో ముఖ్యమంత్రి అయ్యాక మడకశిర పారిశ్రామికవాడకు భూములిచ్చిన రైతులకు రూ.34 కోట్ల నష్ట పరిహారం అందించారు. ఆ తర్వాత ఈ పారిశ్రామికవాడలో పరిశ్రమలను ఏర్పాటు చేయడానికి కూడా శ్రీకారం చుట్టారు. రూ.250 కోట్లతో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించడానికి వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో భూమిపూజ చేశారు. ఈ కర్మాగారానికి అవసరమైన భూమిని కూడా ఏపీఐఐసీ కేటాయించింది. అంతేకాకుండా పలు ప్లాస్టిక్ ఫ్యాక్టరీల నిర్మాణానికి కూడా వైఎస్ జగన్ హయాంలో ఏపీఐఐసీ భూ కేటాయింపులు చేసింది. అయితే తాజా కూటమి ప్రభుత్వం స్థానికంగా పరిశ్రమల ఏర్పాటుకు కనీస చర్యలు తీసుకోలేదు.

ఉపాధి కోసం వలస వెళ్లా



నేను డిగ్రీ వరకూ చదువుకున్నా. స్థానికంగా ఉపాధి లేకపోవడంతో వలస పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమల ఏర్పాటుకు నియోజకవర్గంలో అన్నీ అవకాశాలున్నాయి. అయినా ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయడం అన్యాయం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలి.

– రవికుమార్, తురకవాండ్లపల్లి, మడకశిర మండలం

ఉద్యోగం రాదు.. భృతి లేదు



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోవడం లేదు. మడకశిరలో 1,600 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటింది. కనీసం ఒక్క పరిశ్రమ ఏర్పాటుకూ అడుగులు ముందుకు పడలేదు. కనీసం నిరుద్యోగ భృతి అయినా ఇస్తారంటే...అదీ లేదు.

– యోగేష్, అలదపల్లి, అమరాపురం మండలం

రైతులకు అదనపు ఆదాయమార్గం చూపండి



జిల్లా అధికారులతో వ్యవసాయ, అనుబంధ రంగాల ప్రగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: రైతులకు అదనపు ఆదాయ మార్గాలు చూపాలని, ఈ మేరకు ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శనివారం ఆయన... కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయ, అనుబంధ శాఖలు, డ్వామా, భూగర్భజల, మార్కెటింగ్ శాఖల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తూ అత్యుత్తమ దిగుబడులు సాధిస్తున్న రైతులను గుర్తించి... వారి సాధించిన విజయాలను వారి ద్వారానే రైతులకు వివరించేలా చూడాలన్నారు. ఉద్యాన పంటల సాగులో డ్రోన్ టెక్నాలజీ వినియోగం, టిష్యూ కల్చర్ ద్వారా దానిమ్మ సాగు చేయడంపై అవగాహన కల్పించాలన్నారు. గొల్లపల్లి రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్‌కుమార్, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ ఏడీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్‌డీఎం రమణకుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, మార్కెటింగ్ శాఖ అధికారి నరసింహమూర్తి, భూగర్భ జలశాఖ అధికారి మల్లికార్జున రావు పాల్గొన్నారు.

టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డిపై కేసు



అశ్వర్థరెడ్డి

హిందూపురం అర్బన్: విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని కులం పేరుతో దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసి, విధులకు ఆటంకం కలిగించిన టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థరెడ్డితో పాటు మరో ఎనిమిది మందిపై హిందూపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని ముక్కిడిపేట వీఆర్‌ఓగా రామ్మోహన్ పనిచేసేవారు. 2024 జూలై 2వ తేదీన ఆయన విధుల్లో భాగంగా హిందూపురం టీడీపీ మండల కన్వీనర్, తాజా మార్కెట్ యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డితో పాటు మరో ఎనిమిది మంది టీడీపీ నేతలు రామ్మోహన్‌తో గొడవకు దిగారు. తాము చెప్పిన మాట వినవా అంటూ కులంపేరుతో దూషించడంతో పాటు ఆయన విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై అప్పట్లోనే రామ్మోహన్ హిందూపురం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు శనివారం టీడీపీ మండల కన్వీనర్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డితో పాటు ఎనిమిది మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

అక్కడ కేసు.. ఇక్కడ ప్రత్యక్షం

- రామగిరి నుంచి పెనుకొండకు శివకుమార్‌నాయుడు
- సహకరించిన ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్!
- పోలీసుల వైఫల్యానికి ఇదే నిదర్శనం



పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద రెచ్చిపోతున్న శివకుమార్‌నాయుడు

సాక్షి, పుట్టపర్తి సజావుగా సాగాల్సిన రామగిరి ఎంపీపీ ఎన్నికల్లో అల్లర్లు జరగడానికి పోలీసుల వైఫల్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. రామగిరి ఎస్‌ఐగా పని చేస్తున్న సుధాకర్ యాదవ్ కనుసన్నల్లోనే దాడులు, దౌర్జన్యాలు, అల్లర్లు జరిగాయని స్పష్టంగా అర్థం అవుతోంది. రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈనెల 26వ తేదీన జరిగిన అల్లర్లలో రామగిరి మండలం ఆర్.కొత్తపల్లికి చెందిన శివకుమార్‌నాయుడు నిందితుడిగా ఉన్నాడు. ఆ గొడవ కేసుకు సంబంధించి ఆయన పోలీసుల అదుపులో ఉండాలి.. అయితే మరుసటి రోజు పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఘర్షణలో అతను కనిపించాడు. శివకుమార్‌నాయుడు రామగిరి నుంచి పెనుకొండకు వచ్చేందుకు ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ సహకారం ఉందని సమాచారం. పోలీసుల అండదండలు లేనిదే.. ఓ కేసులో నిందితుడు మరో ప్రాంతానికి ఎలా వస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. పెనుకొండ తహసీల్దార్ కార్యాలయంలోనూ ఆయన తీరు అవతలి వ్యక్తులను రెచ్చగొట్టేలా ఉన్నట్లు వీడియోల ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. పోలీసులే ఇలా నిందితులను తీసుకువచ్చి ఘర్షణలకు ఉసిగొల్పడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

'రెసిడెన్షియల్' ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

- ఏప్రిల్ 6 వరకూ అవకాశం

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్‌తోపాటు ఏపీ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో (2025–26 విద్యాసంవత్సరం) ప్రవేశానికి దరఖాస్తు గడువును ఏప్రిల్ 6వ తేదీ వరకూ పొడిగించినట్లు కొడిగెనహళ్లి ఏపీఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. శనివారం ఆయన పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొడిగెనహళ్లి పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి 80 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు ఉమ్మడి జిల్లాలతో పాటూ నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న బాలురు మాత్రమే అర్హులన్నారు. అదే విధంగా 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు 'ఏపీఆర్ఎస్ క్యాట్ 2025'కు, www.aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే ఏపీఆర్ జేసీ, డీసీ కళాశాలల్లో ప్రవేశానికి ఆసక్తి కలిగిన వారు 'ఏపీఆర్ జేసీ, ఏపీఆర్ డీసీ సెట్ 2025'కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా అందే దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామన్నారు. గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సమ్మోహనం.. ఆధ్యాత్మిక సౌరభం



యూత్ సభ్యుల సాంస్కృతిక ప్రదర్శన



జీవనోపాధుల కిట్లను అందజేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు



సంగీత విభావరి నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ యూత్ బృందం

ప్రశాంతి నిలయం: సాయి భక్తులు ఆధ్యాత్మిక సాంస్కృతిక వైభవాన్ని చాటుతూ నిర్వహిస్తున్న ప్రదర్శనలు భక్తకోటిని మైమరపిస్తున్నారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ సత్యసాయి యూత్ సభ్యులు రెండో రోజు శనివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత ఆధ్యాత్మిక భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 'అంతరంగ సాయి' పేరుతో సంగీత విభావరి నిర్వహించారు. సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ తరఫున మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, ఆయన సతీమణి హిమవాహిణి పలువురు సత్యసాయి భక్తులకు జీవనోపాధులు పెంపొందించే కార్యక్రమంలో భాగంగా కిట్లను అందజేశారు. సాయంత్రం 'శ్రీ సత్యసాయి విజయము' కవి సమ్మేళనం నిర్వహించారు.

నేడు ప్రశాంతి నిలయంలో వేడుకలు..

ప్రశాంతి నిలయంలో ఆదివారం ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 8 గంటలకు వేద పఠనంతో సాయికుల్వంత్ సభా మందిరంలో వేడుకలు ప్రారంభం కానున్నాయి. 8.30 గంటలకు పంచాంగ శ్రవణం, 9.15 గంటలకు శ్రీ సత్యసాయి వెబ్‌పోర్టల్ ప్రారంభం ఉంటుందని ట్రస్ట్ వర్గాలు తెలిపాయి. సాయంత్రం సంగీత విద్వాంసురాలు గుడిపాటి లలితా బృందం సంగీత విభావరి ఉంటుందని వెల్లడించారు.

క్లుప్తంగా

కాలువలో వ్యక్తి గల్లంతు

సోమందేపల్లి: మండల కేంద్రం సోమందేపల్లిలోని నక్కల గుట్ట కాలనీ వద్దనున్న హంద్రీ–నీవా కాలువలో వ్యక్తి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం రాత్రి గాలింపు చర్యలు చేపట్టారు. కాలువ గట్టుపై ద్విచక్ర వాహనంతో పాటు దుస్తులు, చెప్పులు ఉండడంతో ఈతకు వెళ్లి గల్లంతయ్యి ఉండవచ్చని భావిస్తున్నారు. ఆ వ్యక్తి ఎవరనేది తెలియాల్సి ఉంది.

కూలిన విద్యుత్ స్తంభం.. చెలరేగిన మంటలు


ఊబిచెర్లలో కూలిన స్తంభం

గుత్తి రూరల్: ఊబిచెర్ల గ్రామ శివారులో శనివారం విద్యుత్ స్తంభం నేలకూలడంతో మంటలు చెలరేగాయి. రైతులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామ శివారులోని గట్టుస్వామి ఆలయానికి వెళ్లే దారి పక్కనున్న విద్యుత్ స్తంభం ఒక్కసారిగా వీచిన గాలులకు నేలకూలింది. స్తంభం ఓ వైపునకు ఒరిగి విద్యుత్ తీగలు నేలకు తాకి నిప్పురవ్వలు ఎగిసిపడటంతో మంటలు చెలరేగాయి. ఆలయానికి వెళ్లే దారి పక్కనున్న చెత్తాచెదారం అంటుకొని పెద్ద ఎత్తున మంటలు వ్యాపిస్తుండటంతో రైతులు గమనించి పరుగున అక్కడకు చేరుకుని అటుగా ఎవరూ రాకుండా చూశారు. స్తంభం కూలిన తర్వాత రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా అలానే ఉంది. అనంతరం రైతులు అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరా నిలిపివేయించారు.

సంతోషం.. వెనువెంటే విషాదం!

- ఉద్యోగం ఆర్డర్ కాపీ అందుకుని మృత్యుఒడిలోకి జారిన తల్లి
- మతిస్థిమితం కోల్పోయిన తండ్రి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు

అసలే నిరుపేద కుటుంబం... రోజూ కూలి పనులకు వెళితేనే పూట గడుస్తుంది... లేకుంటే పస్తులతోనే గడపాల్సి ఉంటుంది. ఇటువంటి పరిస్థితిలో ఆ ఇల్లాలికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ఈ సంతోషం ఎంతో సమయం నిలవలేదు. విధి వక్రీకరించడంతో ఉద్యోగం ఆర్డర్ కాపీ అందుకున్న రోజే ఆరోగ్య పరిస్థితి విషమించి ఆస్పత్రి పాలైంది. చికిత్స పొందుతూ మృతి చెందింది. పిల్లలు అనాథలయ్యారు.


జ్యోతి (ఫైల్)

గుమ్మఘట్ట: బేలోడు గ్రామానికి చెందిన నడిమింటి తిప్పేస్వామి, రత్నమ్మ దంపతుల రెండవ కుమార్తె జ్యోతి పుట్టుకతోనే అంధురాలు. పదేళ్ల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా దొడగట్ట గ్రామానికి చెందిన తిప్పేస్వామితో జ్యోతికి పెళ్లైంది. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. భర్త కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. సజావుగా సాగిపోతున్న వీరి కాపురానికి గుర్తుగా ప్రతాప్, ప్రకిత, రాజు అనే ముగ్గురు సంతానం కలిగారు.

వికలాంగుల కోటాలో ప్రభుత్వ ఉద్యోగం

నాలుగు నెలల క్రితం బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో వికలాంగుల కోటా కింద జ్యోతి దరఖాస్తు చేసుకుంది. జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ చేపట్టిన ఇంటర్వ్యూకు హాజరైన ఆమెకు అర్హతే ప్రామాణికంగా బుక్కరాయసముద్రం జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో స్వీపర్ పోస్టు దక్కింది. ఇందుకు సంబంధించిన ఆర్డర్ కాపీని గత నెల 19న అందుకున్న జ్యోతి... ఉన్నఫళంగా కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు.

సంబరం వెనుకే కన్నీళ్లు...

జ్యోతికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని తెలియగానే ఇటు పుట్టినిల్లుతో పాటు అటు మెట్టినింట్లో సంబరాలు చేసుకున్నారు. ఆరోగ్యం కుదుట పడి విధుల్లో చేరాలని పూజలు చేశారు. నెలకు బేసిక్ రూ.20 వేలు, డీఏ, హెచ్‌ఆర్‌ఏ ఇతర అలవెన్సులు కలుపుకుని మొత్తం రూ.30 వేల వరకూ జీతం అందే ఉద్యోగం కావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ఆశించారు. అయితే ఈ సంబరం ఎంత కాలమూ నిలవలేదు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 13న ఆమె కన్నుమూసింది. విషయం తెలియగానే భర్త తిప్పేస్వామి ఒక్కసారిగా కుదేలైపోయాడు. తీవ్ర మనోవేదనలో మతిస్థిమితం కోల్పోయి రోడ్డున పడ్డాడు.


అనాథలుగా మారిన చిన్నారులు ప్రతాప్, ప్రకిత, రాజు

అనాథలుగా పిల్లలు

తల్లి మృతి, తండ్రి దగ్గర లేకపోవడంతో అనాథలుగా మారిన ముక్కుపచ్చలారని ముగ్గురు చిన్నారులను అమ్మమ్మ రత్నమ్మ చేరదీసింది. అయితే ఆమె కుటుంబ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో పిల్లల పోషణ ఆమెకు భారమైంది. దాతలు ఎవరైనా సహకరించి పిల్లల బాగోగులకు, చదువులకు ఆర్థిక సాయం చేయాలని నిస్సహాయ స్థితిలో రత్నమ్మ వేడుకుంటోంది.

సాయం చేయదలిస్తే...

పేరు :	నడిమింటి రత్నమ్మ
బ్యాంక్ :	ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, బేలోడు శాఖ
ఖాతా నంబర్ :	9106 524 0666
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ :	ఏపీజీబీ0001018

పందుల అపహరణ ముఠా సభ్యుల అరెస్ట్

బొమ్మనహాళ్ కాదు — బెళుగుప్ప: రాత్రిపూట పందులను అపహరించుకెళ్లే ముఠాలోని ఇద్దరు సభ్యులను ఎస్‌ఐ శివ శనివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జనవరి ఐదో తేదీ అర్ధరాత్రి పందులు అపహరణకు గురయ్యాయని బెళుగుప్పకు చెందిన రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అనుమానితులైన రాయదుర్గానికి ఎరుకుల నాగరాజు అలియాస్ గబ్బర్‌సింగ్, కళ్యాణదుర్గానికి చెందిన ఎరుకల ముత్యాలప్ప అలియాస్ బాలరాజును శుక్రవారం రాత్రి గుండ్లపల్లి క్రాసింగ్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తే పందులు అపహరించి తామేనని ఒప్పుకున్నారు. పందులు విక్రయించగా వచ్చిన సొమ్ములోంచి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.15వేల చొప్పున మొత్తం రూ.30వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరితో పాటు ముఠా నేత అనంతపురానికి చెందిన ఆదినారాయణ, సభ్యుడు వెంకటేశులుతో పాటు మరొకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంకటేశులు పందుల అపహరణ కేసులో చిత్రదుర్గం పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయ్యారని, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. పట్టుబడిన ఇద్దరు దొంగలను కళ్యాణదుర్గం కోర్టులో హాజరు పరుచగా.. మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారన్నారు.

పండుగ పూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం


మృతి చెందిన రామకృష్ణ

రాప్తాడురూరల్: ఉగాది పండుగ పూట విషాదం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదంలో ఒక బేల్దారి దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం యాలేరుకు చెందిన ఎన్.రామకృష్ణ (35), ఇస్మాయిల్, ఎర్రిస్వామి ముగ్గురూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రోజువారి పనుల్లో భాగంగా ముగ్గురూ శనివారం ఉదయం గ్రామం నుంచి ఒకే బైకుపై అనంతపురం బయల్దేరారు. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని గుడ్‌విల్లర్స్ స్కూల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మహారాష్ట్రకు చెందిన లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ సర్వజన ఆస్పత్రికి తరలించారు. వీరిలో రామకృష్ణ పరిస్థితి విషమించి సాయంత్రం మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. రూరల్ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

బైక్ ఢీకొని వృద్ధురాలు...

రాయదుర్గంటౌన్: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. శ్రీనీలకంఠేశ్వరస్వామి ఆలయం వెనుక ప్రాంతంలో నివాసం ఉంటున్న జయలక్ష్మి (64) శనివారం రాత్రి ఏడు గంటల సమయంలో బళ్లారిరోడ్డులో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనదారుడు ఢీకొన్నాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన జయలక్ష్మిని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోడ్డు ప్రమాద ఘటనపై మృతురాలి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు.

పెనుకొండ టీడీపీలో వర్గపోరు

- మంత్రి సవిత, ఎంపీ బీకే మధ్య విభేదాలు
- ఆవిర్భావ దినోత్సవం రోజున మరోసారి బట్టబయలు

పెనుకొండ: టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి మధ్య వర్గ పోరు మరోసారి బహిర్గతమైంది. శనివారం ఎవరికి వారు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం చర్చనీయాంశమైంది. మంత్రి సవిత పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించగా, ఎంపీ బీకే. పార్థసారథి పట్టణంలోని తన స్వగృహంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు జరుపుకున్నారు. దీంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు రెండువర్గాలుగా వీడి తమ అభిమాన నాయకుల వద్ద వేడుకల్లో పాల్గొన్నారు.

సూరీడు.. సుర్రు

- బొమ్మనహాళ్‌లో అత్యధికంగా 42.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

అనంతపురం అగ్రికల్చర్: సూరీడు మండిపోతున్నాడు. జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. రోజురోజుకూ 'అనంత' అగ్నిగుండంలా మారుతోంది. శనివారం బొమ్మనహాళ్‌లో 42.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గుంతకల్లు–42 డిగ్రీలు, యల్లనూరు–41.1, విడపనకల్లు–41, శింగనమల–40.9, కూడేరు–40.8, తాడిపత్రి–40.7, నార్పల–40.5, పుట్లూరు–40.3, గార్లదిన్నె, యాడికి, గుత్తి, పెద్దవడుగూరు–40.1 డిగ్రీలు నమోదైంది. అటు శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా కొత్తచెరువు–41.2 డిగ్రీలు, చెన్నేకొత్తపల్లి–41.2, తాడిమర్రి–41.1, ముదిగుబ్బ–41, కనగానపల్లి–40.6, పుట్టపర్తి–40.4, నల్లమాడ, గుడిబండ, బత్తలపల్లి –40.3, ధర్మవరం, రామగిరి–40.2, తలుపుల 40.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 28 డిగ్రీల మధ్య నమోదవుతూ సెగలు పుట్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరిగే ప్రమాదం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

ఈవీఎంల భద్రతపై ప్రత్యేక నిఘా


ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం అర్బన్: ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల భద్రతపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను భద్రపరిచిన గోదామును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరచిన గోదామును తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నామని తెలిపారు. ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నటరాజ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుట్టుగా శ్రీగంధం దుంగల తరలింపు


జంబుగుంపల చెక్‌పోస్ట్ వద్ద శనివారం అర్ధరాత్రి వెళ్తున్న శ్రీగంధం దుంగల వాహనం

కుందుర్పి: మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి అటవీ ప్రాంతాల నుంచి శ్రీగంధం దుంగలు అక్రమంగా తరలిపోతున్నాయి. కర్ణాటకకు చెందిన వ్యాపారులు రాత్రివేళ అటవీ ప్రాంతాల్లో శ్రీగంధం చెట్లతో పాటు టేకు తదితర చెట్లను నరికి, ముక్కలుగా చేసి శిరా, అమరాపురం, హిరియూరు తదితర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తరలింపును అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

1న రాతి దూలం లాగుడు పోటీలు

పుట్లూరు: మండలంలోని నాయకునిపల్లి సమీపాన బాట సుంకులమ్మ ఆలయం వద్ద ఏప్రిల్ ఒకటో తేదీ రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఒంగోలు జాతి వృషభాల రాతి దూలం లాగుడు పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానికి మొదటి బహుమతి రూ.60వేలు, రెండో బహుమతి కింద రూ.50 వేలతో పాటు మొత్తం 11 నగదు బహుమతులు అందించనున్నారు.

యువకుడి ఉసురు తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

హిందూపురం అర్బన్: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడు ఉసురుతీసింది. బెట్టింగ్‌లో డబ్బు పోగొట్టుకుని.. అప్పులిచ్చిన వారికి ముఖం చూపించలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. హిందూపురం సమీపంలోని మలుగూరు రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి సంఘటన స్థలాన్ని సందర్శించి.. మృతుడి ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేశారు. చనిపోయినది తన కుమారుడు ఇంతియాజ్ (29) అని మలుగూరు గ్రామానికి చెందిన జలీల్‌ఖాన్ పోలీసులకు తెలిపారు. ఇంతియాజ్ మొబైల్‌షాపులో పనిచేసేవాడని, మొబైల్ బెట్టింగ్ యాప్‌లో పాల్గొన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ క్రమంలోనే బెట్టింగ్ కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక బలవన్మరణానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైతును బలిగొన్న అప్పులు


జంపాల పల్లెన్న (ఫైల్)

ధర్మవరం అర్బన్: వ్యవసాయం కోసం చేసిన అప్పులు రైతును బలిగొన్నాయి. కనగానపల్లి మండలం నరసంపల్లికి చెందిన రైతు జంపాల పల్లెన్న(65)కు ఐదు ఎకరాల పొలం ఉంది. అందులో వేసిన రెండు బోర్లు ఎండిపోవడంతో పక్క తోట రైతు నుంచి నీరు తీసుకుని వేరుశనగ, జొన్న సాగు చేశాడు. అయితే సరిపడునన్ని నీరు అందక పంటలు చేతికందలేదు. బోర్లు, పంట పెట్టుబడుల కోసం చేసిన అప్పులు రూ.7లక్షలకు చేరుకున్నాయి. వాటిని తీర్చే మార్గం కనిపించకపోవడంతో శనివారం ధర్మవరం రైల్వేస్టేషన్‌లోని ఐదో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు భార్య ముత్యాలమ్మ, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కరెంటు షాక్‌తో 26 అడవి పందుల మృతి


మృత్యువాత పడిన అడవి పందులు

యల్లనూరు: తోటలోకి చొరబడిన అడవిపందులు కరెంట్ షాక్‌కు గురయ్యాయి. 26 అడవి పందులు అక్కడికక్కడే మృతి చెందాయి. కల్లూరులో రైతు రామచంద్ర కుమారుడు మొక్కజొన్న సాగు చేశాడు. రాత్రిపూట అడవి పందుల గుంపు వచ్చి పంటను నాశనం చేస్తుండేవి. దీన్ని గమనించిన రైతు పొలం వద్ద కరెంటు కంచె వేశాడు. శుక్రవారం రాత్రి యథావిధిగా అడవిపందుల గుంపు వచ్చింది. తీగలు తాకగానే కరెంట్‌షాక్ కొట్టి 26 ఆడ అడవిపందులు ప్రాణం విడిచాయి. మరో ఐదారు పందులు తప్పించుకున్నాయి.

నేడు పశువుల సంత బంద్

అనంతపురం అగ్రికల్చర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ ఆదివారం పశువుల సంత ఉండదని సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.